# వాయురోగం

టి. శ్రీనివాసరావు ఎం.బి.బి.ఎస్. డిగ్రీ సంపాదించి రెండు సంవత్సరాలైనా వెళ్ళకపూర్వమే వైద్యవృత్తిని మనసార నిరసించటం మొదలుపెట్టాడు. మనిషి కీడెంచితే భగవంతుడు మేలెంచటం కొంచం విరుద్ధంగా తోచిందతనికి. అతనికి సంపాదన తప్పనిసరికాదు. పదిహేను వీసాలు సరదాగా కొన్ని సంవత్సరాలు మెడికల్ విద్యార్థి జీవితం గడపవచ్చును కదా అని డాక్టరు చదువు చదివాడు. కోర్సు ప్రారంభించగానే తెలిసొచ్చింది యూనివర్సిటీ వాళ్ళు తనచేత వెట్టిచాకిరి చేయించ దలిచారని. శ్రీనివాసరావు మొండెత్తువేసి ఇంటిదగ్గిర పుస్తకం ముట్టుకున్న పాపాన పోకుండా ఆరిపోతు. సంవత్సరాంతాన పాసయివాడు. కోర్సంతా ఆ విధంగానే గడిచింది. తప్పేవాళ్ళేంచేసి తప్పతారో అతనికి అర్థంకాలేదు.

ప్రాక్టీసుకూడా ఎవరూ తనదగ్గిరికి రారుకదా. పది పదిహేనేళ్ళనించీ తనతోటి డాక్టర్లు ప్రాక్టీసు లేకుండా అవస్తపడుతుంటే తనకెక్కణ్నించి వస్తుంది కనక, అనుకుని చెక్కగొట్టి నాలుగు నెలలు కాలేదు, అప్పుడే అతని క్లయింట్ల లిస్టు నూరు దాటింది, అతని వర్కింగవర్స్ రోజుకు పన్నెండుగంట లయినై. అతని సంపాదన నెలకు నూట యాభైలో పడ్డది! వెధవజీవితమను కున్నాడు శ్రీనివాసరావు. అతనికి డబ్బును చూస్తే అసహ్యమనీ, పేరు ప్రతిష్ఠలు చేదనీ కాదు, అంత బద్ధకస్తుడు పుట్టబోడు, పెరగబోడు.

శ్రీనివాసరావు నిట్టూర్పు విడిచి లేచాడు. చేతినున్న గడియారం చూశాడు ఆరూ పది! సినిమాకైనా పోవచ్చు. ఏం బతుకు? లేచింది మొదలు రోగులు, రోగులు, రోగులు! విసుగూ విరామం లేకుండా–రోగులు! అందరికన్నా క్షమించ టానికి వీల్లేందెవర్నంటే–రోగుల్ని! ఛత్!

"కాంపౌండర్!"

"చిత్తం!"

"నేనలా పార్కువైపు వెడుతున్నానూ. ఏడయేదాకా ఉండి నువ్వుకూడా వెళ్ళిపో!"

"మళ్ళీ శర్మగారు రింజక్షన్ కోసరం వస్తారేమో?"

"ఆయన విషయం చిత్రంగా ఉందోయ్, మరీనూ! ఇప్పటికే రెండనవస రంగా పుచ్చుకున్నాడు. గట్టిగా చెబితే ఈ డాక్టరుత్తి చవట నాగమ్మ అని ఊరంతా చాటి పారేస్తాడని భయం! ఆ! మరేం, మళ్ళీ పాయింట్ త్రీ ఇవ్వు – మెల్లిగా చెప్పిచూసి వినకపోతే!"

కాంపౌండరు అలాగేనని తల వూపుతూ నవ్వాడు.

"అయనకు ఇంజక్షన్లు మంచి గుణమిస్తున్నాయటండీ!" అన్నాడతను.

"సరే! నే నలా పోయి వస్తాను."

"చిత్తం!"

డాక్టరు శ్రీనివాసరావు వెళ్ళే ప్రయత్నంలో ఉండగా ఒక కుర్రవాడు అనుమానిస్తూ లోపలికి ప్రవేశించి అతనికి నమస్కారం చేశాడు.

"ఎవరికోసం?"

"డాక్టరుగారు లేరండి?"

"నేనే డాక్టర్ని."

"మీతో ఒక మాట మాట్లాడి పోదామని వచ్చానండి."

"ఇప్పుడు కాదు. ఇప్పుడు నాకు చాలా జరూరుపని వుంది. రేపొద్దున ఏడు దాటాక రా?"

"అప్పుడు నాకు వీలుపడదండి. రేపు రమ్మంటే వస్తాను కాని మళ్ళీ ఈ వేళకే వస్తాను."

శ్రీనివాసరావు ఆ కుర్రవాడి అహంకారానికి మండిపడ్డాడు. "మరి నాకీ వేళప్పుడెన్నడూ తీరదూ!" అన్నాడు.

"కానివ్వండి మరో డాక్టరు దగ్గిరికి పోతాను" ఆ కుర్రవాడు దీనంగా వెనక్కు తిరిగాడు. శ్రీనివాసరావుకు జాలేసింది. ఆ కుర్రవాడి పీపు అతని హృదయాన్ని చిత్రంగా ద్రవించింది. ఇంత సేపున్నవాడింకో అయిదు నిమిషాలుంటే మునుకు పోయిందేమిటి? గడపదాకా వెళ్ళిన కుర్రవాణ్ని వెనక్కు పిలిచాడు డాక్టరు.

"ఏమిటి నువ్వు చెప్పదలిచింది?" అన్నాడతను కుర్చీలో కూర్చుని.

"నేను చెప్పదలిచింది త్వరలో కాదేమోనండి!" అన్నాడు కుర్రవాడు అనుమానిస్తూ.

"ఇప్పటికి క్లుప్తంగా ముగించు. తరవాత రేపు వింటాను. సరేనా?"

"చిత్తం, అలాగే కానివ్వండి. ఇంతకూ నాకు కావలిసిందేమంటే-నేను గతమంతా మరిచిపొయ్యేటట్లు చెయ్యగలరా?"

ఆ కుర్రవాడు తనతో పరాసికాలాడుతున్నాడని అనుమానం తగిలి డాక్టరు ఊంకొట్టలేదు.

"పగలంతా యిబ్బంది లేదండి. రాత్రి నిద్రపట్టదు. గడిచిన విషయాలన్నీ కళ్ళలో మెదులుతూంటై దానికేదైనా మందు—"

ఒకముక్క ముక్కి డాక్టరు కుర్చీలోనించి లేస్తూ— "కాంపౌండర్! ఇతనికొక స్లీపింగ్ మిక్శ్చర్ యిచ్చి పంపెయ్" అన్నాడు.

"మీకు బ్రొమైడ్స్‌తో పొయ్యేరోగం కాదండి ఇది" అన్నాడు కుర్రవాడు.

శ్రీనివాసరావు నిర్ఘాంతపోయినాడు. అంత కుర్రాడికి పదేళ్ళయినా వుంటయ్యో వుండవో? బ్రొమైడ్స్‌ను గురించి తెలుసుననేకాదు అతని ఆశ్చర్యం, అంతకన్న ఆశ్చర్యకరంగా వుంది ఆ కుర్రవాడి గొంతు. ఆ కుర్రవాడి గొంతులోనించి అంత గంభీరమైన నాదం ఎలా వచ్చింది?

"క్షమించండి. మీకు నేనార్డర్లివ్వడానికి రాలేదు. కాని నా రోగం సరిగా కనుక్కుంటే మీరు మంచి మందివ్వగలుగుతారని నా ఆశ. మీరు డాక్టర్లు. నేను మీకు చెప్పేదేమిటి? సగంచెప్పి సగం చెప్పకపోవటం నాకే హాని అదీకాక నేను టూకీగా నా అవస్థ చెప్పాలని ప్రయత్నం చేస్తే నా మాటలు నమ్మరు. మాట వరసకు నేను గతం మరిచేటందుకు మందిమ్మన్నాననుకోండి యింత చిన్నవాడికి

గతమేమిటా అని మీరు నవ్వరా? నేను పుట్టి పెరిగిన ఈ పది సంవత్సరాల్లో మరవదగినది ఏమంత లేదు కానిండి, అంతకుపూర్వం నడిచింది! దాన్ని భరించ లేను. అది నన్ను విడవకుండా వుంది! నా గుండెమీద పెద్ద రాయల్లే వుంది. ఆ రాయి ఎత్తేసిన పుణ్యాత్ముడికి కెంత పుణ్యమన్నా వుండండి."

శ్రీనివాసరావు ఒక్క-క్షణం నీళ్ళలో ఊపిరాడక తన్నుకున్న వాడల్లే మధనపడ్డాడు. చివరకతను బిగ్గిరిగా "ఆగు. నువ్వు చెప్పేది ఒక్క-ముక్క- నా కర్థం కావటం లేదు. నీ పేరేది?" అని అరిచాడు కాంపౌండరు అదిరిపడేట్టు.

"నా పేరు సత్యం!"

"అలా ఒక్కో- ప్రశ్నకే మెల్లిగా సమాధానం చెప్పు. నీ వయస్సెంత?"

"పదేళ్ళు."

"ఊఁ ఈ మధ్య నీ కేమైనా పెద్ద జబ్బు చేసిందా?"

"లేదండి."

"మీ వంశంలో ఎవరికైనా-ఎవరికైనా—కొంచం మతి చాంచల్యం—అలాటిదేమైనా వుందా?"

"అబ్బే! లేదండి."

"నీకు తరుచు కలలు వస్తూండటం—మేలుకునుండే కలలు కంటం కద్దా?"

"నాకు మతి చెడ్డదనే ఉద్దేశంతో మీరిలా ప్రశ్నిస్తే నే చెప్పదలిచిందెలా చెప్పడం?"

సరిగా ఈ సమయానికి కాంపౌండరు లైటు తెచ్చి బల్లమీద పెట్టాడు. శ్రీనివాసరావు తన కెదురుగా నిలబడ్డ ఆ కుర్రవాడి మొహం వంక చూశాడు. అతని దృష్టి సరాసరి సత్యం కళ్ళమీదికి పోయింది. అతని శరీరం కంపించటం మొదలుపెట్టింది. అవేం కళ్ళు? వాటిని చూస్తే తన శరీరం ఎందుకంత కంపిస్తుంది? కుర్రవాణ్ణి చూసి తన కెందుకంత ముచ్చెమటలు పొయ్యటం?

సత్యంకూడా డాక్టరువంక ఆశ్చర్యపడుతూ చూడటం మొదలుపెట్టాడు.

"నేను మిమ్మల్ని కిందటిసారి చూసినప్పుడు మీ మొహం ఇంకో తీరుగా వుంది! మీకు నన్ను వెనకెప్పుడైనా చూచిన జ్ఞాపకం వుందాండి?"

"లేదు, లేదు! నిన్ను నే నెరగను. నువ్విక్కణ్ణించి వెళ్ళిపో. పో!" అని అరిచాడు శ్రీనివాసరావు.

కాంపౌండరు ఆదుర్దాగా ప్రవేశించాడు కాని ఆ ఇద్దరిలో ఒకరుకూడా అతనివైపు తల తిప్పలేదు. అడివిలో అకస్మాత్తుగా ఎదురైన రెండు సమాన బలంగల క్రూరజంతువులల్లె ఒకరిమీదినించి ఒకరు చూపు తప్పించలేకుండా వున్నారు. ఇద్దరికీ మతిపోయిందనుకున్నాడు కాంపౌండరు.

శ్రీనివాసరావుకూ సత్యానికి ఒక్క భేదం మాత్రం వుంది, శ్రీనివాసరావు సహజంగా మాట్లాడే స్థితిలో లేడు. అరిస్తే అరవటం లేకపోతే నోరు తెరలేక పోవటం. సత్యం మన ప్రపంచంలో లేకపోయినా మాట్లాడగలిగి వున్నాడు. ఆ గొంతుమాత్రం పెద్దగా లేకపోయినా అమానుషంగా వుంది. కాంపౌండరు చూస్తుండగానే అతను డాక్టరువైపు వేలుచూపిస్తూ "నువ్వారోజున దానికోసం మామూలు ప్రకారం సూర్యాస్తమయమైన పదిగడియలకు ఇల్లు బయలుదేరావు. రాజుగారి ఉప్పు తింటున్న నేను-దాన్ని చూసే నీకన్న లక్షరెట్లు మోహంగల నేను నీ వెంబడే వచ్చాను. దానింట్లోకి నువ్వు పోతుండగా నేను అసమర్థుడల్లే ఏమీ చెయ్యలేకపోయినాను. నువ్వు లోపలికిపోయి తలుపు వేసుకోగానే నేను కోనేట్లోదిగి మీ కిటికి దగ్గిరికి ఈదుకుంటూ వచ్చి అంతా చూశాను. నా రక్తం వుడికిపోయింది. నాకు ఏనుగకున్నంత బలం వచ్చింది. గట్టెక్కి తిరిగివచ్చి ఒక్కతోపుకు తలుపు పగలతన్ని లోపల ప్రవేశించి దాని చేతుల్లో వున్న నిన్ను రాజాజ్ఞ అంటూ బాకుతో పొడిచాను. అది రాజాజ్ఞకాదు! అబద్ధం ఆడాను."

అకస్మాత్తుగా శ్రీనివాసరావు పెద్ద పెడబొబ్బ పెట్టి "దుర్మార్గుడా! పాపఫలం అనుభవించు" అంటూ తన వెనకాల కుర్చీతీసి గట్టిగా సత్యం నెత్తిన కొట్టాడు. ఉత్తరక్షణం అతనికి స్పృహ తప్పిపోయింది.

ఆ దెబ్బకు కుర్చీకోడు విరిగింది. కుర్రవాడు చెక్కు చెదరలేదు. కాని అతనిలో మార్పు గమనించానంటాడు కాంపౌండరు. మాట్లాడుతున్నంతసేపూ ముప్పై నలభై ఏళ్ళవాడల్లే కనపడ్డ సత్యం అకస్మాత్తుగా కుర్రవాడయినట్టయింది. అతను చప్పున చిన్నపిల్లవాడి కీసు గొంతుతో "అరెరే! అదేమిటండీ- డాక్టరు గారలా పడిపోయారు!" అని అరిచాడు.

డాక్టరుకు గంటసేపటికి తెలివివచ్చింది. అతని ధోరణి చూస్తే కుర్రవాడు తనతో ఏమీ చెప్పలేదంటాడు. తనకు పని జాస్తయి అరోగ్యంచెడి పైత్యంచేసి మూర్ఛ వచ్చిందంటాడు. ఆ కుర్రవాణ్ని కూడా కదిలించి చూశాను, కాని అతనికి కిందటి జన్మ తాలూకు సంగతులేవీ జ్ఞాపకం ఉన్నట్టు కనిపించదు. ఆ రోజున అక్కడి కెందుకొచ్చావంటే నిద్రపట్టటానికి మందుకోసరం వచ్చానని ఒప్పుకున్నాడు. డాక్టరు కుర్చీ తనమీద వెయ్యలేదంటాడు. డాక్టరు పిచ్చివాడల్లే ప్రవర్తించటం కూడా గమనించానంటాడు. కాని అది పైత్యపు తెరయొక్క ఫలితమని డాక్టర్ అంగీకరించాడు. ఆ పిల్లవాడు ఆశ్చర్యపడటం కూడా తనకు జ్ఞాపకం వున్నదంటాడు డాక్టరు. కాని తను డాక్టర్నుచూసి ఆశ్చర్యపడ్డట్టు

కుఱ్రవాడే అంగీకరిస్తున్నాడు. కుర్చీకాలి సాక్ష్యం కూడా ఎందుకూ పనికిరాదు. డాక్టరు కుర్చీఎత్తి దూరంగా పారేసిననూట డాక్టరూ కుఱ్రాడూ కూడా ఒప్పుకుంటున్నారు కనక ఇద్దరిలో ఒక్కరైనా దాపరికం కోసరం ప్రయత్నిస్తున్న వాళ్ళల్లే లేరు.

ఎటొచ్చీ కాంపౌండరు సాక్ష్యం ఒక్కటే వుంది. అది ఎంతవరకు నమ్మతగ్గదో మీరే నిశ్చయించుకుంటారుగాక!

(ప్రథమ ముద్రణ : జనవరి 1935, ఆంధ్రభూమి)